క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతనూతలపాడు: విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని పేర్నమిట్ట, ఎండ్లూరు, మైనంపాడు, చలప్పాలెం, గ్రామాలకు నేడు శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒంగోలు రూరల్ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు దీనిని గమనించాలని ఆయన కోరారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లు తొలగించే పని వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోనుగుంట, గుండువారి లక్ష్మీపురం, రామచంద్రపురం, పిడతలపూడి, పుట్టచెరువుపాలెం, గృహ, గృహేతర వినియోగదారులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వేడుకగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని వెంకటేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం మధ్యాహ్నం వైభవంగా జరిగింది. యాజ్ఞికులు పరాంకుశం సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈనెల 8వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించగా శుక్రవారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణానంతరం స్వామి భక్త బృందం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి తాటిపర్తి అంజిరెడ్డి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కోదండరామస్వామి



స్వామి అమ్మవార్ల పూజ క్రతువులో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: భక్తిశ్రద్ధలతో కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నగర సమీపంలోని వలేటివారిపాలెం గ్రామంలో గల ప్రసిద్ధ కోదండరామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి అభిషేకాలు, కైంకర్యాలు నయనమనోహరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గర్భాలయంలో గల సీతా, లక్ష్మణ సమేత కోదండ రాముని మూలమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, కొబ్బరి నీరు, పన్నీరు, గంధంలాంటి పలు రకాల అభిషేకాలు జరిపించారు. అనంతరం దేవతామూర్తులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విశేష అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కళ్యాణ్ చక్రవర్తి గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు.

తల్లికి వందనంలో కోతలు వద్దు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

దర్శి (కురిచేడు): తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాల్లో జమ చేయాలని, నిబంధనల పేరుతో కోతలు పెట్టవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. అడ్డగోలు నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.5 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ తల్లికి వందనం వర్తింప చేయాలని, ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ నగదు వేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు అయిన వెంటనే వారికి కూడా నగదు చెల్లించాలని కోరారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలని సీపీఎం డిమాండ్ చేస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వం విధించిన షరతులను విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకు మించిన షరతులు పెట్టి లబ్ధిదారులతో పాటు నగదును కూడా తగ్గించడం సరికాదన్నారు. రూ.15 వేలు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి నేడు రూ.2 వేలు కోత పెట్టడం ఏమిటని నిలదీశారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయింపు ఇవ్వటం హామీ ఉల్లంఘనేనని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించటం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేనన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులకు ఈ పథకం అమలు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

చేతి పంపులపై చిన్నచూపు

- గిరిజన గూడేల్లో మరమ్మతులకు నోచుకోని బోర్లు
- అధికారుల నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్న చేతి పంపులు





పనిచేయని చేతిపంపులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేతి పంపుల నిర్వహణ అధ్వానంగా మారింది. పలు గ్రామాలు, గిరిజన గూడేల్లోని చేతి పంపులు అత్యధిక శాతం నిరుపయోగంగా మారాయి. గతంలో నీటి ఎద్దడి నివారణకు లక్షలాది రూపాయలు వెచ్చించి వాటిని ఏర్పాటు చేసింది. అనంతరం వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడంతో చాలాచోట్ల అవి నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని గిరిజన గూడేలైన తుమ్మలబైలు, చిన్నారుట్ల, చింతల, బోడేనాయక్ తండా, పెద్దమంతనాల, రోళ్లపెంట, కొర్రప్రోలు, అయ్యన్నకుంట తదితర గిరిజన గూడేల్లోని చేతి పంపులు నిర్వహణ లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి.

ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారేరి?

చేతి పంపులు మరమ్మతులకు ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల చేతి పంపులు కనుమరుగయ్యాయి. మరికొద్ది ప్రాంతాల్లో బోరింగుల వద్ద మురికి నీరు నిలిచి అపరిశుభ్రంగా మారాయి. మండల పరిధిలోని పలు గిరిజన గూడేల్లో సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయా గూడేల్లో విద్యుత్ ఉంటేనే నీళ్లు అన్న చందంగా మారిపోయింది. దట్టమైన అభయారణ్య ప్రాంతంలోని చెట్ల నుంచి గిరిజన గూడేలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో చెట్లు రాపిడికి గురైనా విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది. దీంతో గూడేల్లోని చెంచు గిరిజనులకు చేతి పంపులే శరణ్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చేతి పంపుల నిర్వహణ బాధ్యత మండల పరిషత్ అధికారులపై ఉంది. చేతి పంపులు మరమ్మతులు చేసేందుకు ప్రత్యేక సిబ్బంది ఉన్నప్పటికీ అధికారులు చేతి పంపుల నిర్వహణపై దృష్టి సారించక పోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. గిరిజన గూడేల్లో మరమ్మతులకు గురైన చేతి పంపులను బాగు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడని గిరిజనులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ నాసరరెడ్డి వివరణ కోరగా బోర్ల మరమ్మతులకు సంబంధించిన నిధులు విడుదల కావడం లేదు. 10 రోజుల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి మండల పరిధిలోని గిరిజన గూడేల్లో పాడైన బోర్లను గుర్తించే ఏర్పాట్లు చేస్తాం. త్వరలోనే వాటికి మరమ్మతులు నిర్వహించి చెంచు గిరిజనులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తాం.

పింఛన్ కోసం వితంతువు పాట్లు

- రాకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతలు



పెన్షన్ కోసం అధికారులకు ఇచ్చిన అర్జీ



బాధితురాలు పద్మావతితో ఆమె కుమారుడు

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం పూర్తి అయినా లబ్ధిదారులకు పెన్షన్‌లు మంజూరు చేయడంలో విఫలమవుతోంది. భర్త చనిపోయి దాదాపు నెలలు అవుతున్నా వితంతవులకు పెన్షన్‌లు మంజూరు చేయడంలో ఆలస్యం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే ప్రధాన కారణంగా టీడీపీ నేతలు అర్హులకు పింఛన్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొర్రపాటి వారిపాలెం గ్రామానికి చెందిన గోనుగుంట పద్మావతి కుమారుడు హరికృష్ణ కథనం ప్రకారం.. ఇంటి యజమాని గోనుగుంట రామయ్య గత సంవత్సరం సెప్టెంబర్ 17న పెన్షన్ తీసుకుంటూ అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన భార్య పద్మావతి పెన్షన్ కోసం అధికారులకు దరఖాస్తు చేసుకుంది. స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పెన్షన్ మంజూరు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా. గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే ఉద్దేశంతోనే టీడీపీ నాయకులు ఇలా చేస్తున్నారని తల్లి, కుమారుడు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పెన్షన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ దారా హనుమంతురావును వివరణ కోరగా దరఖాస్తును పరిశీలించి పెన్షన్ వచ్చేలా చూస్తానని చెప్పారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ముండ్లమూరు (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆ పార్టీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ముండ్లమూరు మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా దుగ్గినేని రామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కుంటా పేరమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా జిల్లెల్లమూడి శివయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎం.నందయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గోపనబోయిన శ్రీను, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బాణావత్ హనీశ్వర్‌నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ కాలేషావలి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రాచపూడి మిరియన్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా సిద్ది కోటిరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా బిజ్జం కృష్ణారెడ్డి, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా పాలడుగు చిరంజీవి, వలంటీర్ వింగ్ అధ్యక్షుడిగా రమణాల కోటేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పులికొండ శ్రీనివాసరావు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా షేక్ అంజిబాబు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా కానాల రవికుమార్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కుంటా సునీల్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా సన్నపురెడ్డి వెంగళరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా ఇరుగుల కొండారెడ్డిలను నియమించారు.

తాళ్లూరు మండలం..

యూత్ వింగ్ అధ్యక్షుడిగా కొర్రపాటి విష్ణు, రైతు విభాగం అధ్యక్షుడిగా గువ్వల శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా నాగల్ల వెంకటరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా యామర్తి ప్రభుదాసు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా జగన్నాథం సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ లతీఫ్ అలియాస్ బచ్చా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రావినూతల కోటేశ్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా కైపు అశోక్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా మందా శాంసన్, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా పాణెం నాగార్జునరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా సోము వీరాంజనేయరెడ్డి, వలంటీర్ విభాగం కన్వీనర్‌గా నాగళ్ల గోపి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా నారాయణ సెట్టయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మారం శివ, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా అనపర్తి యోహన్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పులి వెంకట రమణారెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కొనికి గోవిందరాజ్ యాదవ్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ముచ్చుమారి బ్రహ్మారెడ్డి, పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడిగా గంగిరెడ్డి వెంకటరెడ్డిలను నియమించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

కొండపి: మండలంలోని కే.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు వి.సుసన్న కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సూసన్న కుమార్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో, ఈఏపీసెట్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, నాణ్యమైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని గ్రామాలే లక్ష్యం



క్షయవ్యాధి గురించి పూర్తి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి

కొత్తపట్నం: క్షయవ్యాధి లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా క్షయ వ్యాధి, లెప్రసీ అధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గమళ్లపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం ప్రజలకు టీబీ క్షయ వ్యాధిపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయ వ్యాధిని ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి నిర్మూలన చేయాలని నిర్ణయించిందన్నారు. కాని మన దేశం దేశ వ్యాప్త ఉద్యమం ద్వారా 2025 నాటికి క్షయ నిర్మూలన చేయాలని సంకల్పించడం సంతోషంగా ఉందన్నారు. వ్యాధి నిర్మూలించడానికి నాలుగు ప్రధాన లక్ష్యాలను నిర్ణయించామని చెప్పారు. కేసులను ముందుగా గుర్తించడం, నూరు శాతం చికిత్సతో పాటు సేవలు, వ్యాధిపై సమాజంలో ఉన్న అన్ని రకాల సంఘ నాయకులతో ప్రజలకు అవగాహన కలిగించే ప్రణాళికలు రచించామని తెలిపారు. అలాగే ముందస్తు గుర్తింపు కోసం ఇంటింటిని సందర్శించి ఉచిత నిర్ధారణ, మందులు ఇచ్చే కార్యక్రమం చేయాలన్నారు. టీబీ రోగులకు కమ్యూనిటీ నాయకులు, ఎన్‌జీవో సంస్థలు వారిచే ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వాలని కోరారు. 100 రోజుల్లో ఈ వ్యాధిపై ప్రజల్లో వైద్య సిబ్బంది ద్వారా విస్తృతమైన అవగాహన కార్యక్రమం, వ్యాధి నిర్ధారణ వారికి మందులు పంపిణీ చేయడం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈతముక్కల పీహెచ్ డాక్టర్ నవ్యారెడ్డి, సర్పంచ్ బలగాని రమణమ్మ, బలగాని నారాయణ, గ్రామస్తుల పాల్గొన్నారు.

అర్హత పొందిన విద్యార్థులు తక్షణమే చేరాలి



బీ.పద్మావతి, ప్రిన్సిపాల్

చీమకుర్తి: చీమకుర్తి బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన విద్యార్థినులు తక్షణమే పాఠశాలలో చేరాలని ప్రిన్సిపాల్ బీ.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు నిర్వహించిన ఎంట్రెన్స్ ఫలితాల్లో ఎంపికైన విద్యార్థినులు పాఠశాల, కాలేజీ క్లాసులు ప్రారంభమైనందున వెంటనే చేరాలని తెలిపారు.

సుఖీభవకు షరతులు!
అన్నదాతకు నిబంధనాలు!

- గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో 12,883 మంది రైతుల అనర్హత
- తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ ఉన్న రైతులు 17736 మంది
- కూటమి ప్రభుత్వ తీరుతో అన్నదాతల్లో గుబులు
- పథకం వర్తింపజేస్తారో, ఎగనామం పెడతారోనని ఆందోళన
- ఈకేవైసీ చేయకుంటే పథకం లేనట్లే..
- వైఎస్సార్ సీపీ హయాంలో పారదర్శకంగా 'రైతు భరోసా'

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతన్నలు సాగుకు సన్నద్ధం కావాల్సిన సమయమిది. కూటమి సర్కారు ఇస్తామన్న పెట్టుబడి సాయం గత ఏడాది నిలిపేయడం, ఏ ఏడాది షరతులు, నిబంధనలు పెడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పూర్తిగా రైతులకు కాలం కలిసిరాలేదు. అతి వృష్టి-అనావృష్టి, పంటలకు విపరీతంగా తెగుళ్లు రావడం, అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందలేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, దిగుబడి లేక రైతన్నలు రోడ్డెక్కిన సంఘటనలు కూటమి ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్నాయి.

అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత తీరిగ్గా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పథకం వర్తించాలంటే షరతులు వర్తిస్తాయంటూ మెలిక పెట్టింది. ఏ రైతుకు పథకం అందుతుందో ఏ రైతుకు వర్తించదో తుది జాబితాలో చూసుకోవాలని షాకిచ్చింది. ఎన్నికల సమయంలో పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతులకు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వ నిబంధనలు నష్టం కలిగించేలా ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి మంగళం పాడింది. ఒక్కో రైతుకు ఇస్తామన్నా రూ.20 వేలు ఇచ్చుంటే జిల్లా రైతాంగానికి రూ.572 కోట్లు లబ్ధి చేకూరేది. దీనిని విస్మరించిన కూటమి సర్కారు ఇప్పుడు లబ్ధిదారులను తగ్గించేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తోంది.

ఈకేవైసీ లేదంటే గోవిందా..!

అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందే రైతుల సంఖ్యను మరింత తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పెట్టుబడి సాయం పొందాలంటే ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు సాయమందుతుందని స్పష్టం చేసింది. లేదంటే నగదు ఖాతాల్లో జమ చేసేది లేదని ప్రకటించింది.

గత ప్రభుత్వంలో పారదర్శకంగా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్‌ల్యాండ్ వివరాలే ఆధారంగా ఐదేళ్లపాటు రైతు భరోసా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారు. ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందించి అన్నదాతకు అండగా నిలిచారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలుగలేదు. అధికారుల పరిశీలన, నివేదికలంటూ హడావుడి ఎక్కడా కనిపించేది కాదు. ఒక్క రైతు కూడా ఈ పథకం అందలేదన్న ఫిర్యాదు లేకుండా పథకాన్ని కొనసాగించారు. కేంద్ర వాటా రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,500 కలిపి రూ.13,500ను గత వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిబంధనల పేరుతో లబ్ధిదారుల జాబితాలో కోతలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్హులు, అనర్హుల జాబితా ఇలా..

మార్కాపురం నియోజకవర్గం

మండలం	మొత్తం రైతులు	ఆమోదం పొందినది	తిరస్కరణకు గురైంది	తహసీల్దార్ పెండింగ్
మార్కాపురం	18,198	14,722	2,868	608
పొదిలి	17,529	14,799	1,715	1,015
తర్లుపాడు	11,805	10,459	863	483
కేకే మిట్ల	18006	14,232	1594	2,180
మొత్తం	65538	54,212	7040	4,286

గిద్దలూరు నియోజకవర్గం

మండలం	మొత్తం రైతులు	ఆమోదం పొందినది	తిరస్కరణకు గురైంది	తహసీల్దార్ పెండింగ్
కంభం	12,372	10,658	1406	308
బీవీ పేట	14,688	11,785	606	2,297
కొమరోలు	12,446	8,775	891	2,780
గిద్దలూరు	16,516	11,750	1,421	3,315
అర్థవీడు	11,288	8,629	757	1,902
రాచర్ల	11,043	7,433	762	2,848
మొత్తం	78353	59,060	5843	13,450

ఉపాధి కూలీలకు కనీస వేతనం ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి కూలీల సమస్యల గురుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమకు రోజు వారీ తగినంత కూలీ పడటం లేదని, మంచినీటి వసతి కూడా లేదని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలన్నారు. కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న పశువైద్య సిబ్బంది

తాళ్లూరు: సబ్సిడీపై పాడి రైతులకు సమీకృత దాణా పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారి వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాధవరంలో శుక్రవారం పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 కిలోల దాణా సంచి ధర రూ.1110 ఉండగా 50 శాతం సబ్సిడీపై రూ.555 అందించినట్లు చెప్పారు. దాణాతో పశువుల ఆరోగ్యంతో పాటు అధిక పాల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా విడతల వారీగా పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ టి.రేణుక, ఏహెచ్ఏ ఆంజనేయులు పాల్గొన్నారు.